క్లుప్తంగా

బిల్లులు సక్రమంగా చెల్లించాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఆర్‌సీపీ నాయకులు

నల్లమాడ: ఉపాధి హామీ కూలీలకు బిల్లులు సక్రమంగా చెల్లించాలని రాయలసీమ కమ్యూనిస్ట్ పార్టీ (ఆర్‌సీపీ) పుట్టపర్తి, నల్లమాడ మండలాల కార్యదర్శులు ఎం.శంకర, మగ్గం చంద్ర డిమాండ్ చేశారు. మండలంలోని చౌటకుంటపల్లి వద్ద ఉపాధి హామీ పనులను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఉపాధి బిల్లులు వారం వారం సక్రమంగా చెల్లించకపోవడంతో కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం



జ్యోతులతో తరలివస్తున్న మహిళలు

హిందూపురం: పట్టణంలోని శ్రీకంఠపురంలో వెలసిన గ్రామదేవతలు సుంకలమ్మదేవి, దుర్గమ్మ, పెద్దమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకంఠపురం, లక్ష్మీపురం, డీఆర్‌కాలనీ తదితర ప్రాంతాల నుంచి మహిళలు జ్యోతులను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు.

టంగుటూరి ప్రకాశం పంతులుకు నివాళి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు

కనగానపల్లి: ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుకు పలువురు నివాళులర్పించారు. స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో మంగళవారం టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి గోవిందు దేశ స్వాతంత్ర పోరాటంలో ప్రకాశం పంతులు చూపిన ధైర్య సాహసాలను కొనియాడారు. యోగా గురువు సుబ్బరాయుడు, గ్రామస్తులు నాగభూషణ, నరసింహులు, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు



ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

పుట్టపర్తి టౌన్: పట్టణంలో హోటల్, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, దుకాణాలో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శానిటేషన్ అధికారి శివయ్య హెచ్చరించారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని గణేష్ సర్కిల్‌లో ఉన్న పలు హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, దుకాణాలు వారపు సంతను పరిశీలించి అక్కడ వాడుతున్న కవర్లను స్వాధీనం చేసుకుని, జరిమానా విధించారు. శానిటేషన్ అధికారి మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందన్నారు. పడేసిన కవర్లను పశువులు తిన్నా ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ఆ కవర్లు భూమిలో వేసినా అవి కుళ్లవన్నారు. ఇలా ప్రజారోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లను వినియోగించకూడదన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

తనకల్లు: మండల పరిధిలోని గోళ్లవారిపల్లిలో నాగరాజు అనే వ్యక్తి మంగళవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాగరాజు ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో పడిపోయాడు. కొంతసేపటి తర్వాత గమనించిన స్థానికులు అతడిని తనకల్లు ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కదిరికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి అనంతపురం తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

విద్యార్థులూ.. సర్టిఫికెట్లు సిద్ధమా?



- కుల, ఆదాయ తదితర సర్టిఫికెట్లకు ఇదే సమయం
- విద్యాసంస్థల్లో ప్రవేశాలకు అన్నీ రెడీగా ఉంచుకోవాలి

ధర్మవరం రూరల్: మరికొద్ది రోజుల్లో కళాశాలలు, పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. పదో తరగతి, ఇంటర్మీడియెట్ తదితర పరీక్షల ఫలితాలు కూడా వెలువడ్డాయి. ఉన్నత చదువుల్లో భాగంగా కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు పలు ధ్రువపత్రాలు తప్పనిసరి. వీటిని ముందస్తుగా పొందేందుకు మంచి తరుణమని అధికారులు సూచిస్తున్నారు. అందులో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో ధ్రువ పత్రాలను అందజేయడానికి అధికారులు అందుబాటులో ఉంటున్నారు.

ముందుగానే తీసుకోవాలి

సాధారణంగా జూన్‌లో అధికారులు బిజీగా ఉంటారు. ఖరీఫ్ పంటలు సాగయ్యే సమయం కావడంతో విత్తన పంపిణీ తదితర కార్యక్రమాల్లో నిమగ్నమవుతారు. జూన్ ప్రారంభం కాగానే తహసీల్దార్ కార్యాలయాల్లోని సిబ్బందిపై ధ్రువ పత్రాల జారీకి సంబంధించి అధిక ఒత్తిడి ఉంటుంది. దరఖాస్తుల సంఖ్య పెరగడంతో వీఆర్‌ఓలు, ఆర్‌ఐలు క్షేత్రస్థాయి పరిశీలన, డిజిటల్ సంతకాలు తదితర పనులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కార్యాలయాలకు పలుమార్లు తిరగాల్సి ఉంటుంది. ముఖ్యంగా అనుకున్న సమయానికి పత్రాలు అందకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అధికారులంతా అందుబాటులో ఉన్నప్పుడే అన్ని పత్రాలూ తీసుకొని దగ్గర పెట్టుకోవడం మంచిది.

సర్టిఫికెట్లు పొందాలంటే..

ప్రస్తుతం చదువుతున్న తరగతుల నుంచి పై తరగతుల్లో ప్రవేశానికి కులం, ఆదాయం, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ సర్టిఫికెట్లు తప్పనిసరి. వీటి కోసం సచివాలయాలు, మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి.

- ఆధార్, రేషన్ కార్డు, విద్యార్హత పత్రాలతో సంబంధిత దరఖాస్తు పూర్తిచేసి అవసరమైన జిరాక్స్‌లను జత చేసి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌కు అందజేయాలి.
- ఆన్‌లైన్‌లో పొందుపరిచిన వివరాలపై వీఆర్‌ఓ, ఆర్‌ఐ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. అన్నీ పక్కాగా ఉంటే చివరగా తహసీల్దార్ తన లాగిన్‌లో మరోసారి పరిశీలించి డిజిటల్ సంతకం చేస్తారు. దీనిపై మొబైల్‌కు వచ్చే మెసేజ్ ద్వారా దరఖాస్తుదారులు సచివాలయాలు, మీ సేవ కేంద్రాల్లో ధ్రువ పత్రాలను పొందవచ్చు.

అందుబాటులోనే ఉంటాం



రెవెన్యూ సిబ్బంది కార్యాలయంలో నిత్యం అందుబాటులో ఉంటున్నారు. పాఠశాలలు, కళాశాలలు, వృత్తి విద్యా కోర్సుల్లో చేరే సమయంలో అవసరమయ్యే ధ్రువపత్రాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే వాటిని ఇవ్వడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుతం కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీ నిర్దేశించిన సమయం కంటే ముందుగా ఇచ్చేందుకు వీలుంటుంది. అదే జూన్‌లో అయితే రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. అప్పుడు కొంచెం ఆలస్యమయ్యే అవకాశం ఉండొచ్చు.

నటరాజ్, తహసీల్దార్, ధర్మవరం

ప్లంబర్లకు న్యాయం చేసే వరకు పోరాటం



రిలే దీక్షలు చేస్తున్న సీపీఐ, కార్మిక సంఘాల నాయకులు

ధర్మవరం: పట్టణంలోని 650–2 సర్వేనంబర్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టి.. ప్లంబర్లకు న్యాయం చేసే వరకు పోరాటం ఆగదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు స్పష్టం చేశారు. మంగళవారం ఏఐటీయూసీ, కార్మిక సంఘం, ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషియన్స్ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం బయట రిలే దీక్షలు చేపట్టారు. నియోజకవర్గ కార్యదర్శి మధు మాట్లాడుతూ 650–2 సర్వేనంబర్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టకుండా ఆర్డీఓ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సదరు సర్వే నంబరులో అనర్హులను గుర్తించి వారి పట్టాలు రద్దు చేసి.. అర్హులైన ప్లంబర్లకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోకపోతే రాబోయే కాలంలో అధికారులను రోడ్డు మీదకు తీసుకొచ్చే విధంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రిలే దీక్షల్లో సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, ఏఐటీయూసీ కార్మిక సంఘం నాయకులు ఎర్రంశెట్టి రమణ, ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషియన్స్ సంఘం అధ్యక్షుడు గోవిందరాజులు, కార్యదర్శి అన్నం లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆంజనేయులు, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, తాజుద్దీన్, సురేంద్ర, మసూద్, చిన్నా, నాగేంద్ర, శ్రీనివాసులు, మహిళా సమాఖ్య నాయకులు లలితమ్మ, లింగమ్మ, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలి



మానవహారంగా ఏర్పడిన కార్మికులు

పుట్టపర్తి టౌన్: కార్మికుల మెడకు ఉరితాడైన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు పుట్టపర్తిలోని గణేష్ కూడలిలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ల విధానంతో పరిశ్రమల యజమానులకు, కార్పొరేట్లకు, మోదీ మిత్రులకు లాభదాయకంగా ఉన్నాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏరంగంలో పనిచేసే కార్మికులకైనా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమానపనికి సమాన వేతనం అమలుచేసి రెగ్యులర్ చేయాలని, అంగన్‌వాడీ, ఆశా, యానిమేటర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ఏడాదికి 200 రోజుల పనిదినాలు పెంచి రోజు కూలి రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బ్యాళ్ల అంజి, ముత్యాలప్ప, నాగార్జున, రాజుబాబునాయక్, జాఫర్, సుజాత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలసిన జిల్లా యూత్ ప్రెసిడెంట్



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌తో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, గంగుల సుధీర్‌రెడ్డి

కనగానపల్లి: శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ యూత్ ప్రెసిడెంట్ గంగుల సుధీర్‌రెడ్డి వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రిని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిశారు. రాప్తాడు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి మంగళవారం విజయవాడకు వెళ్లిన ఆయన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో కలసి వైఎస్ జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం చేయటంతో పాటు పార్టీ కార్యకర్తలను అండగా నిలవాలని పార్టీ అధినేత సూచించినట్లు సుధీర్‌రెడ్డి తెలిపారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



కనగానపల్లి- మామిళ్లపల్లి రహదారిలో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

కనగానపల్లి: మండలంలోని కనగానపల్లి– మామిళ్లపల్లి రహదారిపై పాలవాయి మిట్ట వద్ద కల్వర్టు చాలా ప్రమాదకరంగా ఉంది. నిత్యం వాహనాలు తిరిగే ఈ రహదారిలో కల్వర్టును నాసిరకంగా నిర్మించారు. దీంతో రహదరిపై వచ్చిన వర్షపు నీటితో పాటు వంకల ద్వారా వచ్చిన నీటితో కల్వర్టు కోతకు గురైంది. చిన్న మలుపుతో పాటు లోతుగా గుంత కూడా ఉండటంతో వాహనదారులు అదుపు తప్పి అటువైపు వెళ్లితే పెద్ద ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి దెబ్బతిన్న కల్వర్టును మరమ్మతు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

మోస్తరు వర్షం



నల్లచెరువులో జాతీయ రహదారిపై నిలిచిన వర్షపునీరు

నల్లచెరువు మండల వ్యాప్తంగా మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. గ్రామీణ ప్రాంతాల్లో మట్టి రోడ్లు చిత్తడిగా మారాయి. నల్లచెరువులోని వైఎస్సార్ సర్కిల్లో జాతీయ రహదారిపై వర్షపు నీరు పారడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

– నల్లచెరువు:

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

కదిరి టౌన్: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి ర్యాలీగా వచ్చి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని, అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అసంఘటితరంగ, స్కీం వర్కర్లకు ఈఎస్ఐ అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ తహసీల్దార్ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్, ముస్తాక్, ఫాజిల్, ఆంజనేయులు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు మాబున్నీసా, సుజాత, శారద, హేమలత, తిరుపాల్, జనార్దన్, ఆశా వర్కర్లు, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: కార్మిక కోడ్‌లు రద్దు చేయడంతో పాటు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు మంగళవారం తహసీల్దార్ రంగనాయకులుకు వినతిపత్రం అందించారు. మినీ వర్కర్లను మెయిన్ కార్యకర్తలుగా గుర్తించాలని, వేతనం పెంచి, అన్ని యాప్‌లనూ ఒకే యాప్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. సీఐటీయు మండల కార్యదర్శి గోవిందు, అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, మహాలక్ష్మి, అంజనమ్మ, అమరావతి, యశోద, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ముదిగుబ్బలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, రైతు సంఘం మండల కార్యదర్శి పోతలయ్య, పక్కీరప్ప, చాంద్‌బాషా, ఆదినారాయణ, ఓబులేసు, వెంకటనారాయణ, డాక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి పునఃప్రతిష్ట



నూతనంగా ఏర్పాటు చేసిన బొడ్రాయి



అన్నదానంలో పాల్గొన్న గ్రామస్తులు

బత్తలపల్లి: ఎం.చెర్లోపల్లిలో బొడ్రాయి పునఃప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. ఇటీవల గ్రామంలో ప్రశాంతత లేకుండా పోయిందని, అకాల మరణాలు చోటు చేసుకుంటున్నాయని, దీని నుంచి బయట పడేందుకు ప్రస్తుతమున్న స్థానంలో కాకుండా మరొక స్థానంలో బొడ్రాయిని ప్రతిష్ఠించాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం వీరనారాయణ స్వామి ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో బొడ్రాయి ప్రతిష్టను గ్రామస్తులు సమష్టిగా నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

రైతులకు పరిహారం చెల్లించాలి

ధర్మవరం అర్బన్: అకాల వర్షాలకు పంటలు కోల్పోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం నాయకులు ఎస్‌హెచ్ బాషా, మారుతి, హైదర్‌వలి డిమాండ్ చేశారు. రైతులు, కార్మిక సమస్యలపై మంగళవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించిన నాయకులు అనంతరం కార్యాలయ ఏఓ ఖతిజున్‌కుబ్రాకు వినతిపత్రం అందించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, హంద్రీ–నీవా కాలువను 10వేల క్యూసెక్కుల సామర్థ్యంలో వెడల్పు చేసి ఆయకట్టుకు నీరందించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. రైతులకు రూ.2 లక్షల దాకా రుణమాఫీ చేయాలన్నారు. మున్సిపల్ వర్కర్లుగా పనిచేస్తూ మరణించిన వారి ఇంటిలో ఉద్యోగం ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, 200 రోజుల పనులు కల్పించి రోజువారి వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు సరస్వతి, ప్రధాన కార్యదర్శి చంద్రకళ, కార్మిక సంఘాల నాయకులు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవుని మాన్యం భూములను సర్వే చేయించండి

కనగానపల్లి: ముక్తాపురం గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న దేవుని మాన్యం భూములను సర్వే చేయించాలని స్థానికులు రెవెన్యూ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం పలువురు గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పీ.వీ. ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని చెన్నకేశవస్వామికి 14.24 ఎకరాలు, ఆంజనేయస్వామికి 12 ఎకరాల దాకా మాన్యం భూములు ఉన్నాయన్నారు. ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా సంబంధిత సర్వే నెంబర్లలోని భూమిని కొలతలు వేసి సర్వే చేయించాలని వారు రెవెన్యూ అధికారులను కోరారు. వీఆర్వో చెన్నకేశవులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బత్తలపల్లి: లింగారెడ్డిపల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ శివయ్య తెలిపారు. మాల్యవంతం, ఎం.చెర్లోపల్లి, చీమలనాగేపల్లి, రాఘవంపల్లి, ముష్టూరు, పోట్లమర్రి, వేల్పుమడుగు, బత్తలపల్లి, లింగారెడ్డిపల్లి, అనంతసాగరం, వెంకటగారిపల్లి, సంజీవపురం, యర్రాయపల్లి గ్రామాల్లో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు విజ్ఞానయాత్ర



విజ్ఞాన యాత్రకు వెళ్తున్న విద్యార్థులు

కదిరి అర్బన్: చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టెమ్ ఎక్స్‌పోజర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం 200 మంది విద్యార్థులను విజ్ఞాన యాత్ర కోసం కదిరి నుంచి పుట్టపర్తిలోని స్పేస్ థియేటర్‌కు తీసుకెళ్లారు. ఈ యాత్రను ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రనాయక్, ఎంపీడీఓ పోలప్ప జెండా ఊపి ప్రారంభించారు. చైల్డ్ ఫండ్ ఇండియా ప్రతినిధులు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పరిశోధనాలోచలనకు బీజం వేస్తాయన్నారు. భవిష్యత్తులో సాంకేతికతను అందిపుచ్చుకుని ఉన్నతంగా ఎదగడానికి దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ ఇండియా ప్రతినిధులు అరవింద్, సుమతి, శివమ్మ, అమర్, పవన్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విద్యార్థులతో వ్యాయామం చేయిస్తున్న గ్రంథాలయ అధికారి

ధర్మవరం అర్బన్: క్రీడలు ఆడటం వల్ల ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని గ్రంథాలయ అధికారి అంజలీ సౌభాగ్యవతి తెలిపారు. పట్టణంలోని జగ్జీవన్‌రామ్‌నగర్‌లోనున్న గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు వ్యాయామాలు, క్రీడల్లో మెలకువలను నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రమణానాయక్, సత్యనారాయణ, శివమ్మ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీ

తలుపుల : ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ నిర్వహించారు. 'ఆడుదాం –ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధులు, వాటి వినియోగంపై విజిలెన్స్ ఎస్‌ఐ గోపాలుడు, అగ్రికల్చర్ వాసుప్రకాష్ కార్యాలయ సిబ్బందితో ఆరా తీశారు. నాలుగు రోజుల్లోగా నివేదిక పంపాలని ఆదేశించారు. తనిఖీలో హెడ్‌కానిస్టేబుల్ చలం పాల్గొన్నారు.

దేశభక్తి పెంపొందించుకోవాలి



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడిమర్రి: పౌరులందరూ దేశభక్తి పెంపొందించుకోవాలని తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి గ్రామస్తులకు సూచించారు. తాడిమర్రిలో మంగళవారం ఆయన మండల అధికారులు, రాజకీయ పార్టీలతో కలిసి తిరంగా ర్యాలీ నిర్వహించారు. శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం సమీపం నుంచి వీరభద్రయ్య స్వామి దేవాలయం వరకు వారు ర్యాలీ సాగింది. తహసీల్దార్ మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో భారత సైనికులు చూపిన ధైర్యసాహసాలు, వీరోచిత పోరాటాలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కృష్ణవేణి, వైద్యాధికారి హరిత, ఏఎస్‌ఐ సూర్యనారాయణ రాజు, హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, బీజేపీ మండల కన్వీనర్ ఆర్వేటి రామ్మోహన్, నాయకులు బిల్లే చంద్రమోహన్, వన్నూర్‌రెడ్డి, శివయ్య, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

తనకల్లు: కొక్కంటిక్రాస్ పెట్రోల్ బంకు సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ గాయపడింది. చీకటిమానిపల్లికి చెందిన నాగవేణి కుటుంబ సభ్యులతో కలిసి బైక్‌లో పాలపాటిదిన్నెకు వెళ్లారు. అక్కడ పని చూసుకున్న తర్వాత తిరుగు పయనమయ్యారు. పెట్రోల్ బంకు వద్దకు రాగానే కోడి అడ్డంగా రావడంతో దాన్ని తప్పించే క్రమంలో ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో నాగవేణి బైక్‌పై నుంచి కిందకు పడింది. తల, వీపు భాగాల్లో బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు ఉచిత అంబులెన్స్‌లో నాగవేణిని తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.